క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: మండలంలోని భక్తరపల్లిలో శుక్రవారం ఉదయం 9 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, సర్పంచ్ కరియన్న తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

తప్పిన ప్రమాదం

అమరాపురం: ఆటో అదుపుతప్పి గుంతలో పడిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు..కర్ణాటకకు చెందిన శంకర్ అరసికెర వైపు బయలుదేరాడు. బసవనపల్లి- కనకనపల్లి మధ్యలో ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శంకర క్షేమంగా బయటపడ్డాడు. అటువైపు వెళ్తున్న వారు ఆటోను గుంతలో నుంచి తొలగించారు.

కూలీల సంఖ్య పెంచండి

అమరాపురం: ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మునిస్వామి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో 200 మంది కూలీలు తప్పకుండా ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగిన వారికి అవగాహన కల్పించి కూలీ పనులకు వచ్చేలా చూడాలన్నారు.

'గాలి జనార్దన్‌రెడ్డితో నాగేంద్ర భేటీ



వేదికపై గాలి జనార్ధనరెడ్డితో కరచాలనం చేస్తున్న నాగేంద్ర

పావగడ: మాజీ మంత్రి బళ్లారి గాలి జనార్ధన రెడ్డితో స్థానిక జేడీఎస్ అసమ్మతి నేత నేరళకుంటి నాగేంద్ర గురువారం భేటీ అయ్యారు. గంగావతిలో నిర్వహించిన గాలి జనార్ధనరెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో నాగేంద్ర అతనితో కలిసి వర్ధమాన రాజకీయాల గురించి చర్చించారు. స్థానిక విధాన సభ ఎమ్మెల్యే టికెట్ జేడీఎస్ తనకు ఇవ్వక పోవడంతో తిమ్మరాయప్పకు గట్టి పోటీ ఇవ్వడానికి గాలి జనార్ధనరెడ్డి పెట్టిన కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీలో నాగేంద్ర చేరిపోయాడు.

గుడిసె దగ్ధం

అమరాపురం: ఆలదపల్లిలో అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మంజునాత్ గుడిసెలో గురువారం మంట వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. అందులో ఉన్న కిటకీలు, వాకిళ్లు కాలిపోవడంతో రూ.40 వేలు నష్టం వాటిల్లింది.

కార్యకర్తలకు అండగా ఉంటా



మాట్లాడుతున్న మధుమతిరెడ్డి

లేపాక్షి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కోడిపల్లి, విభూతిపల్లి గ్రామాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి అధికారంలోకి రావడానికి కృషి చేయాలని వారికి సూచించారు. ఏవైనా సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు బి.రాధమ్మ, పాపన్న, సురేష్ పాల్గొన్నారు.

పరామర్శ



ఈశ్వరప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండల పరిధిలోని శింగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరప్ప, అదే గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ధనుంజయరెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, నాయకులు సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

బైక్ అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నివాసం ఉంటున్న మంజు అనే వ్యక్తికి చెందిన టీవీఎస్ జూపిటర్ బైక్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తాం



గోరంట్ల: పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



రొళ్ల: మల్లసముద్రంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

- పథకాలన్నీ బాగున్నాయి..
- ఆర్థికంగా ఆదుకుంటున్నారు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజల హర్షం

గోరంట్ల: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యకం చేశారు. నేరుగా ఖాతాల్లోకి పథకాల సాయం జమ చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉంటామని తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని నాలుగో వార్డులో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, పేదల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల ద్వారా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని ఆరా తీశారు. అదే విధంగా ఆయా వీధుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం అనేక ఆచారణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సుదీర్ఘ పాదయాత్ర చేశారన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నవరత్నాలు పేర్లతో పథకాలు రూపొందించారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా కులమత రాజకీయాలకు అతీతంగా అర్హులైన నిరు పేదలకు పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. పేదల కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజ బాయి, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జబ్బార్, ఎంపీడీఓ రఘునాథ గుప్తా, వెంకటరమణపల్లి, గుంతపల్లి సర్పంచులు అశ్వర్థరెడ్డి, నార్సిరెడ్డి, నాయకులు సుబహాన్, నరసింహారెడ్డి, చలపతినాయక్, రంగారెడ్డి, గిరిశేఖర్‌రెడ్డి, ల్యాబ్ రామకృష్టారెడ్డి, మిక్సర్ కృష్టారెడ్డి, హిదయతుల్లా పాల్గొన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు అష్షనా. గోరంట్ల మండల కేంద్రంలోని నాలుగో వార్డులో ఉంటోంది. గతంలో ఈ కుటుంబానికి పథకాలు అందలేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. అమ్మ ఒడి పథకం ద్వారా రూ.29,000, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణంతో కలిపి రూ.4.5 లక్షల లబ్ధి చేకూరింది. జగనన్న మేలు ఎన్నటికీ మరువలేమని అష్షనా కుటుంబ సభ్యులు చెబుతున్నారు. జగనన్నకు ఓటు వేసి, గెలిపిస్తామంటున్నారు.



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు గంగమ్మ. ఈమె స్వగ్రామం మల్లసముద్రం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,11,825 లబ్ధి పొందారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా తమకు ఇంతటి సాయం చేయలేదని ఆనందంతో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ఆకాంక్షించారు. జగనన్న మేలును ఎప్పటికీ మరువమని చెప్పింది.

జగనన్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

రొళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే తిప్పేస్వామి కొనియాడారు. గురువారం బీజీ హళ్లి సచివాలయం పరిధిలోని మల్లసముద్రం, అగ్రహారం గ్రామాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో మూడో రోజు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తూనే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లసముద్రం గ్రామం నుంచి బీజీ హళ్లి బీజీ హళ్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. హునిసేకుంట గ్రామానికి వెళ్లే మార్గంలో నిర్మించిన శ్రీరామ ఆలయానికి మట్టిరోడ్డు వేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతు ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. సచివాలయం పరిధిలో వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు విడుదల చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తర్వాత మల్లసముద్రంలో పార్టీ జెండాను నాయకులతో కలిసి ఎగురవేశారు. వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వైస్ ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ సదాశివప్ప, ఈఓఆర్డీ కృష్ణప్ప, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంతోష్, నాయకులు కిట్టప్ప, ఆ నంద్, నాగేంద్ర, రవి కుమార్, ఎంజే యంజారప్ప, వీరక్యాతరాయ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు ఇన్‌చార్జి కార్తీక్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబీవుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, సచివాలయ, మున్సిపల్ అధికారులతో కలిసి టిప్పుకాన్‌స్ట్రీట్, ఢంకాస్ట్రీట్, వక్కలబజార్ ఏరియాల్లో ఎమ్మెల్సీ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలను వివరించడంతోపాటు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తూ ప్రజల నుంచి కృతజ్ఞతలు అందుకుంటూ ముందుకుసాగారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పనిచేసే ప్రభుత్వమని, ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించి తిరిగి పత్తాలేకుండా పోయే నాయకులం కాదన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ ఏకష్టమెచ్చినా ముందుండి పరిష్కరిస్తామన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్ల పాటు పాలన సాగించాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని, టీడీపీకి రాజకీయ సమాధి తప్పదన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడు ఇతరులందరూ కలిసి వచ్చినా ప్రజల ఆశీస్సులు, దేవుడి దయతో ప్రజాసంక్షేమాన్ని కోరుకునే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆయూబ్, మల్లికార్జున, ముస్తాక్, నాగమణి, రహమత్‌బీ, కోఆప్షన్‌సభ్యుడు రహమత్, నాయకులు లతీఫ్, సోమశేఖర్‌రెడ్డి, బాబు, ఫకృద్దీన్, ఇలియాజ్, శివ, నౌషాద్, మస్తాన్, రమణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్థలాలను కాపాడండి



మున్సిపల్ కమిషనర్, టీపీఓకు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

హిందూపురం: ఆటోనగర్ సమీపంలోని సడ్లపల్లి పరిధిలోని సర్వే నెంబర్ 422/1 లేవుట్‌లో మున్సిపాలిటీకి చెందిన 25 సెంట్లు ఆక్రమణలకు గురయ్యాయి. మున్సిపాలిటీ ఓపెన్ సైట్‌లో ప్లాట్లు వేసి కొందరు విక్రయాలు సాగిస్తున్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. 1983లో కృపాశంకర్ లేవుట్‌గా ఎల్‌పీగా సడ్లపల్లి పంచాయతీలో అనుమతులు తీసుకున్నారు. ఇందులో 25సెంట్లు ఓపెన్ సైట్ ప్రభుత్వ పరం చేశారు. మొత్తం 12 0ప్లాట్లు వేసి విక్రయించారు. మిగిలిపోయిన 120వ నెంబర్ 25 సెంట్ల ఓపెన్ సైట్‌పై కొందరు కన్నువేసి వాటిలో నెంబర్ 121నుంచి 129గా కొత్త ప్లాన్ గీయించి, తొమ్మిది ప్లాట్లు వేసి, ఒక్కో సైట్ రూ.8 లక్షలుగా 2022 నవంబర్‌లో విక్రయించేశారు. ప్రజా అవసరం కోసం వదిలిన ఓపెన్ సైట్లను కొందరు అక్రమంగా ప్లాట్లు వేసి అమాయకపు ప్రజలకు అంటకట్టి జేబులు నింపుకుంటున్నారన్నారు. ఇలాగే వదిలేస్తే మున్సిపల్ ఓపెన్ సైట్లు అన్యాక్రాంతమై భవిష్యత్‌లో ప్రజావసరాలకు స్థలాలు లేకుండాపోయే ప్రమాదం ఉందన్నారు. అక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదులను కలెక్టర్, ఆర్డీ, సీడీఎంఏలకు కూడా పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు ఈర్షద్, శివ, ఆసీఫ్‌వుల్లా, రామచంద్రా, నాయకులు నాగరాజు, దాదు, అబీబ్, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్‌బాష తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థలాన్ని విక్రయించి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

శివరాత్రికి అన్నదాన సత్రం ప్రారంభం



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న అధికారులు, కమిటి సభ్యులు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను గురువారం ఉదయం సర్పంచ్ ఆదినారాయణ, హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ విడుదల చేశారు. సుమారు రూ. 60 లక్షల వ్యయంతో అన్నదాన సత్రం నిర్మించారు. ఫిబ్రవరి 9, 10 తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అన్నదాన సత్రం ప్రారంభిస్తామన్నారు. ఈసందర్భంగా అన్నదాన సత్రం నిర్మాణానికి ప్యారిస్‌లో ఉంటున్న స్వాతిరెడ్డి, నవీన్‌రెడ్డిలు జి.జయరామిరెడ్డి ద్వారా రూ.10,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే లేపాక్షికి చెందిన దేవాంగం భారతమ్మ జ్ఞాపకార్థం రాఘవేంద్ర, వెంకటేశులు రూ. 10,121 విరాళమిచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అంజినరెడ్డి, మాజీ ఎంపీపీ ఆనందకుమార్, జేఏసీ సభ్యులు నారాయణస్వామి, రవీంద్రనాథ్, రామాంజనేయులు, రాంప్రసాద్, వీరన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి మార్గంలో నడవాలి

హిందూపురం టౌన్: యువత స్వామి వివేకానంద మార్గంలో నడవాలని బీజేపీ నాయకులు సూచించారు. గురువారం వివేకానంద జయంతిని పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంజీఎం క్రీడా మైదానం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ 2కే రన్ చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి భారత్ మాతాజీ జై అంటూ నినాదాలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవానంద్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, నాయకులు పీడీ పార్థసారధి, వరప్రసాద్, చలపతి, ఆదర్శ్‌కుమార్, సుబ్రమణ్యం, శకుంతలమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, వంశీనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే బాలాయేసు డిగ్రీ కళాశాల, బీఐటీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు.

నాణ్యమైన సరుకుల సరఫరా

పెనుకొండ: పెనుకొండ స్టాక్ పాయింట్ నుంచి నాణ్యమైన సరుకులను చౌకధాన్యపు డిపోలకు సరఫరా చేస్తున్నట్లు స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి మహేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టాక్ పాయింట్ నుంచి నిత్యావసర సరుకుల పంపిణీలో నాణ్యత లేదంటూ వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదన్నారు. స్టాక్ పాయింట్ నుంచి పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాలకు చౌకధాన్యపు డిపోలకు బియ్యం, బ్యాళ్లు సరఫరా చేయడం జరుగుతోందన్నారు.

టీబీ ఎలిమినేషన్‌పై ఇంటింటా సర్వే

హిందూపురం టౌన్: టీబీ వ్యాధి ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని మోడల్‌కాలనీ–2లో ఇంటింటికీ ఎస్ఎన్‌సీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి టీబీ లక్షణాలున్న వారి గళ్ల సేకరించి, పరీక్ష నిర్వహిస్తారు. అందులో టీబీ వ్యాధి నిర్ధారణైతే ఆరు నెలల పాటు టీబీ మాత్రలు ఉచితంగా అందజేస్తారు. సర్వే కార్యక్రమాన్ని డాక్టర్ సుమన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ వేణుగోపాల్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ గౌస్ పీర్, ల్యాబ్ సూపర్‌వైజర్ రవికుమార్‌రెడ్డి, ఆశావర్కర్ బీబీజాన్, జబీన, సర్వే వలంటీర్లు షామీర్, కార్తీక్ పాల్గొన్నారు.

చౌకధాన్యపు డిపోల తనిఖీ

పెనుకొండరూరల్: నగర పంచాయతీ పరిధిలోని మంగాపురం, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లోని చౌకధాన్యపు డిపోలను గురువారం సబ్‌కలెక్టర్ కార్తీక్ తనిఖీ చేశారు. బియ్యం, బ్యాళ్ల నాణ్యతను పరిశీలించారు. పంపిణీ తీరు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యావసరాల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీలర్లను ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

మడకశిర(అగళి): అగళి మండలం పీబ్యాడిగెర, వడగుంటనహళ్లి, కెంకర గ్రామాలకు చెందిన చేపల చెరువులను గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. పీబ్యాడిగెర గ్రామ సచివాలయంలో ఈఓఆర్డీ పద్మావతి ఆధ్వర్యంలో వేలం ప్రక్రియ జరిగింది. పీబ్యాడిగెర చెరువును లోకేశ్ రూ. 1.01 లక్ష, వడగుంటనహళ్లి చెరువును లింగరాజు రూ.71వేలు, కెంకర చెరువును కృష్ణమూర్తి అనే వ్యక్తి రూ.58 వేలకు దక్కించుకున్నారు. మూడు చెరువుల నుంచి ప్రభుత్వానికి రూ. 2.30 లక్షల ఆదాయం లభించింది. కార్యక్రమంలో సర్పంచు నరసమ్మ, ఎంపీటీసీ సురేష్, గ్రామ కార్యదర్శి ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పండగొచ్చె.. సంబరాలు తెచ్చె..



హిందూపురం టౌన్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న రంగు రంగుల ముగ్గు పొడులు



రంగులతో తీర్చిదిద్దిన ముగ్గు

హిందూపురం టౌన్/మడకశిర రూరల్: జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ప్రత్యేకించి సంక్రాంతికి ముగ్గుల పండుగగా పేరుంది. సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు.. వారం రోజుల ముందుగానే గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దడం ఆనవాయితీ. ఫలితంగా మార్కెట్లలో ముగ్గులో వేసేందుకు అవసరమైన రంగు పొడుల విక్రయాలు మొదలయ్యాయి. ముగ్గులు చేసేందుకు మహిళలు, యువతులు రంగుల ముగ్గు పొడులను ఇష్టంగా కొంటున్నారు. ముగ్గులు వేసే సీజన్ సంవత్సరంలో ఇదే కావడంతో మహిళలు, యువతులు తమ ప్రతిభను ప్రదర్శించి రంగురంగుల ముగ్గులను ఇంటి ముంగిళ్లలో తీర్చి, ఆకట్టుకునేందుకు కృషి చేస్తున్నారు. ముగ్గులు వేసేందుకు అవసరమైన ముగ్గుపొడి, రంగులను విక్రయించేందుకు పట్టణ మార్కెట్లో దుకాణాలు వెలిశాయి.

రంగు, రంగుల ముగ్గు పిండికి డిమాండ్

తెల్ల ముగ్గు పిండితో పాటు రంగులు కలిపిన ముగ్గు పిండికి కూడా డిమాండ్ ఏర్పడింది. ముగ్గు పిండి ఒక ధరకు, రంగు కలిపిన ముగ్గుపొడి ఒక ధరకు విక్రయిస్తున్నారు. కళ్లాపి చల్లేందుకు వినియోగించే పేడ రంగు ప్యాకెట్ రూ.5 చొప్పున, తెల్లని ముగ్గుపిండి కిలో రూ.20, రంగు పొడులు పావు కిలో రూ.10, రంగులు కలిపిన ముగ్గుపిండి కిలో రూ.60 వరకూ విక్రయిస్తున్నారు. ఓ మోస్తరు ముగ్గువేసి రంగులు నింపాలంటే కనీసం రూ.50 నుంచి రూ.100 రంగు పొడులు అవసరమవుతున్నాయి. ముందే రంగులు కలిపిన ముగ్గు పిండిని ప్రత్యేకంగా మార్కెట్‌లో లభిస్తుండడంతో మహిళలు రంగులు కొనాల్సిన అవసరం లేకుండా పోతోంది. పండుగ వేళ ముంగిళ్లను రంగు రంగుల ముగ్గులతో నింపడానికి మహిళలు పోటీపడుతున్నారు.



మడకశిరలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

దేశంలోనే నంబర్ వన్ 'నందిని'

పావగడ: ప్రతి నిత్యం 7 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి, ఆంధ్ర ప్రదేశ్‌కు నందిని పాల పొడి సరఫరా, తిరుమల తిరుపతి ఆలయంలో నందిని నేతి నుంచి లడ్డు ప్రసాదాల తయారీతో దేశ వ్యాప్తంగా నందిని పాల ఉత్పత్తులు ప్రథమ స్థానంలో నిలిచాయని స్థానిక కేఎంఎఫ్(కర్ణాటక మిల్క్ ప్రొడక్ట్) జిల్లా డైరెక్టర్ చన్నమల్లయ్య కొనియాడారు. స్థానిక క్షీర భవనంలో గురువారం నిర్వహించిన కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన ప్రతి పాల రైతుకు రూ.లక్ష చొప్పున రూ 1.39 కోట్ల పరిహారాన్ని పంపిణీ చేశామన్నారు. స్వసహాయ స్త్రీ శక్తి సంఘాలకు రుణాల చెక్కులు, కంప్యూటర్లను అందించారు. డా. దిలీప్, సునీత, పాల ఉత్పత్తి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రామాంజినప్ప



రామాంజనప్పకు ధ్రువ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: స్థానిక రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా విరుపసముద్రం రామాంజినప్ప పదవిని చేపట్టారు. స్థానిక సాయిరాం మందిరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఆ పదవి స్థానిక విధాన సభ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్ వి వెంకటేశ్ చేతిలో ఉండగా ఎలాంటి సాంకేతిక అడ్డంకులు రాకుండా ముందస్తు ప్రణాళికలో భాగంగా ఆ పదవిని రామాంజినప్ప కు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా సీనియర్ కాంగ్రెస్ నేత, మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ టీపీ అధ్యక్షుడు రామాంజినప్పకు ఆ పదవి దక్కడం పావగడ రాజకీయ చరిత్ర లో ఇదే మొదటి సారి. అయితే జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పకు అత్యధిక మాదిగ ఓటు బ్యాంకును చెదర గొట్టడానికి చేసిన ఎత్తుగడగా స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటరమణప్ప, మాజీ జెడ్పీ సభ్యుడు వెంకటేశ్, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ టి నరసింహయ్య, అక్కంపల్లి ఆదినారాయణ, మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో యువత ముందుండాలి



మాట్లాడుతున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: యువత విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభను కనపర్చి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా గోళాపురంలో సూర్యఫౌండేషన్ వారు నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు ఆయన బహుమతుల ప్రదానం చేశారు. క్రికెట్‌లో చౌళూరు జట్టు, వాలీబాల్‌లో గోళాపురం జట్టు గెలుపొందింది. విజేత జట్లకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతు లతోపాటు మెమెంటోలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే క్రీడాభివృద్ధి తనవంతుగా రూ.21వేలు ఆర్థిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్షద్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పేరుద్రయ్య, రంగనాథ్, రామాంజి, మనోజ్, చంద్రశేఖర్ రెడ్డి, సూర్య ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం ఏర్పాటుకు విరాళం

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయితీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న వైకుంఠ రథం కోసం డాక్టర్ ఈడిగ ప్రభాకార్ భార్య నీలవేణి తన కుటుంబ సభ్యులతో కలిసి రూ.50 వేల చెక్కు అందజేశారు.

నేడు 'ప్రజావేదిక'

పరిగి: మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.